కొంటూ అన్నాడు.

"చెప్పు ... చెప్పు ... కాని ఒక్కటి గుర్తుంచుకో - ప్రధాని దగ్గర నన్ను దోషిని చేసే పథకం మాత్రం కాకూడదు ...." మంత్రి ఒకింత భయపడుతున్న ట్లుగా అన్నాడు.

లేదు ... లేదు ... అలాంటిదేం కాదు ... పైగా మనకు డబ్బేకాక ఓట్లు కూడా వచ్చే పథకం అది"

"చెప్పు ..." అన్నాడు మంత్రిగారు చప్పున.

"మీ ఇంటి ముందున్న జనాల్ని చూసారుగా"

"చూసాను"

"వాళ్ళు రంగారెడ్డి జిల్లా వాళ్ళు, వాళ్ళ కోరిక తీర్చామనుకోండి మన పథకం పారుతుంది"

"ఎలా ?" మంత్రిగారితో అర్థం కానట్లు ప్రశ్నించాడు.

"వాళ్ళ జిల్లాను కొత్తగా పరిశ్రమలు పెట్టి వారికి సబ్సిడి ఇచ్చే జిల్లాగా ప్రకటింప జేయాలి ..."

"అది వాళ్ళకు లాభమే. మనకెలా ? అయినా అది చాలా కష్టం ..." అన్నాడు మంత్రిగారు కేంద్ర పరిశ్రమల మంత్రిగార్ని తలుచుకుంటూ.

"ఇప్పుడా జిల్లాలో ఎకరం రెండువేల నుంచి పదివేల వరకు పలుకుతోంది. మనం ఇప్పుడే ఓ ఐదారువేల ఎకరాలు కొనేస్తాం, మీరు ఢిల్లీ వెళ్ళి సబ్సిడీ వచ్చేలా చేయగానే దాని రేటు అమాంతం పెరిగిపోతుంది. అప్పుడు మనం దాన్ని అమ్ముకొని కోట్లు గడిస్తాం .... ఏమంటారు ....?"

మంత్రిగారు ఆశ్చర్యంగా చూసారు రుద్రయ్యవేపు.

రుద్రయ్య మౌనంగా మంత్రిగారి నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

అంతలో బయటనుంచి తిరిగి స్లోగన్స్ వినిపించసాగాయి.

మంత్రిగారు ఆలోచిస్తున్నారు. కొద్ది నిమిషాలు మౌనంగా ఉన్నారా యిద్దరు.

"మరినాకు టైమవుతోంది. అవతల మా శ్రీలలితగారు అటెండ్ అయ్యే ఫంక్షన్ ఒకటుంది అక్కడకు వెళ్ళాలి, త్వరగా చెప్పేస్తే వెళ్ళిపోతాను ..." రుద్రయ్య కావాలనే తొందర చేసాడు.

"ఓ.కే" అన్నారు మంత్రిగారు. అంతే ఒక్కసారి "ఎకరం పాతికవేలు" అంటూ ఆనందంగా కేకేసేసాడు రుద్రయ్య. (సశేషం)



# గున్న

శంకరమంచి పార్థసారధి



వెంకటనారాయణకి కోపంఎక్కువ. ఈ విషయం అందరితోపాటు వెంకట నారాయణగూడా అంగీకరిస్తాడు-కోపంలో లేనప్పుడు. సరిగ్గా అటువంటి సమయంలోనే ఇంకాస్త ఓపిగ్గా, కోప్పడతాడేమోనన్న భయం లేకుండా తరిచి తరిచి అడిగితే, అసలీకోపరసానికీ, వాళ్ళ వంశవృక్షానికి వున్న అవినాభావ సంబంధం గురించికూడా చెప్తాడు.

వెంకటనారాయణ తాతగారికి పుట్టెడు కోపం వుండేదిట. ఎప్పుడు చూసినా బుసలు కొడుతూ వుండేవాట్ట. ఎవరన్నా శ్రీరామ అంటే కర్రపుచ్చుకు వెంటపడేవాడట. అంతమాత్రంచేత వారికి పిసరంత పిచ్చిగాని, నయాగరా అంతా నాస్తికత్వంగాని ఉండేవేమోనన్న అనుమానం సహజంగా కలగక మానదు. కాని దేవుడి దయవల్ల పిచ్చి, నాస్తికత్వంలాటి దుర్గుణాలేం వుండేవికావు. కోపంతప్ప - వుప్పు కారం మెండుగా తినటంచేత కోపం ప్రకోపించి వుండుంటుందని తాతగారి తర్వాత తరాల వాళ్ళు సర్ది చెప్పుకున్నారు. మొత్తానికి తన కోపంతో ఇంట్లోవాళ్ళని, బయట వాళ్ళనిగూడా సమంగా కాల్చుకు తిన్నాడని చెప్పుకోటానికి చరిత్రలో ఆధారాలు, ఇంకా బ్రతికున్న సాక్షులు వున్నారు.

వెంకట నారాయణ తండ్రికూడా ఆయన పితృపాదులకున్నంతా (కోపం) వుండేది. కాకపోతే తలెత్తిన కోపాన్ని తప్పనిసరిగా మింగివేసి చిరునవ్వులతో కాలక్షేపం చెయ్యాల్సిన పరిస్థితి వృత్తిరీత్యా ఏర్పడింది. ఆయన పగలంతా శాంతిసంఘానికి జీతం పుచ్చుకునే అధ్యక్షుడిగాను, సాయంకాలాల్లో గీతాసారాన్ని ఓపిగ్గా వుపన్యాస రూపాల్లో చెప్పే పెద్దదిక్కుగాను వుండేవాడుట. అంచేత బయట ఎక్కడా కోపాన్ని ప్రదర్శించే వీలు లేకపోవటంచేత చిరాకుపడిపోయి, ఇంటికి వచ్చీరాగానే పెళ్ళాంమీద విరుచుకు పడేవాడు. ఆయన కోపాన్ని ప్రదర్శించటంలో రకరకాల ప్రక్రియలు, ప్రయోగాలు చేసేవాడని వెంకటనారాయణ స్వయంగా చెప్తాడు.

చిరునవ్వులు చిందిస్తూనే ముక్కచివాట్లు పెట్టటం, మొహం కందగడ్డలాగా ఎర్రబర్చుకుని పెళ్ళాన్ని పడగ్గదిలోకి ఆహ్వానించటం-పందిరిమంచం పైకెక్కి



ధడేల్న దూకటం, మంచం క్రిందకి పరుపేసుకుని లారీ మెకానిక్కులాగా రోజులు తెల్లవార్చుకోవటం, పెళ్ళాం జరీచీర లుంగీలాగా చుట్టుకుని వీధివసారాలో పచార్లు చెయ్యటం, ఇవన్నీ వారి కోపాయణంలో కొన్ని మచ్చుతునకలు.

కోపంలో తనపెద్దవాళ్ళకేం తీసిపోడు వెంకట నారాయణ. కాని కోపం అనేది మనిషికి ప్రథమ శత్రువని గాంధీగారు చెప్పిన మాట గురించి గట్టిగా ఆలోచించి దాన్ని తగ్గించుకోటానికి నిజాయితీగా ఎన్నో ప్రయత్నాలు, సాధనలు పట్టుబట్టి చేసాడు. దానివల్ల కోపం మూడొంతులు కంట్రోలయింది. ఇప్పుడు అతడికోపం ఎప్పుడోగాని రాదు. వచ్చినా పదినిమిషాలకిమించి అస్సలుండదు. కాని వచ్చిన చిక్కల్లా కోపం వచ్చిన ఆ పదినిమిషాలు అతడు అతడుకాడు. వేరే మనిషి. ఏం చేసాడో, ఏం వాగేడో గుర్తుండి చావదు. తర్వాత ఎవరన్నా చెప్పినా నమ్మడు. పుట్టుకతో సహజంగా వచ్చిన కోపాన్ని మొరటు పద్ధతుల్లో అణిచివేసే ప్రయత్నాలవల్ల తల నరాలు తారుమారయినాయని, అంచేతనే వాటి కోపం కక్కినప్పుడు మెదడు మొద్దుబారి మొరాయిస్తుందని, పరీక్ష చేసిన డాక్టర్లు సెలవిచ్చేరు.

ఒకసారి వెంకట నారాయణకి, భార్యకీ ప్రకృతి సహజంగా మాటా మాటా వంటగదిలో భోజనాలముందు పెరిగింది. అతడు చాలాసేపు ఓపిక పట్టి కోపం రాకుండా జాగ్రత్త పడుతూ వచ్చేడు. కాని ఎప్పుడూ శాంతంగావుండే శాంతమ్మకూడా ఆరోజు కోపం రావటంచేత అతడ్ని బాగా రెచ్చగొట్టింది. దాంతో వెంకట నారాయణకి కోపం పాలపొంగులా వచ్చేసింది. కూర్చున్న వాడల్లా చివాల్న లేచి అందుబాటులోవున్న ఆవకాయ జాడీని అవలీలగా పైకెత్తి ధామ్మని నేలకేసి కొట్టేడు. అంతే! నేలంతా ఎర్రటివూట-నెత్తుర్లాగా. తెగిపడ్డ తలకాయల్లాగా చిందరవందరగా ముక్కలు. వంటగది యుద్ధభూమిలాగాను, శాంతమ్మ శోకిస్తున్న భూదేవిలాగాను, వెంకట నారాయణ వీర వెంకట్నారాయణలాగాను తయారయ్యేరు.

మళ్ళీ కొద్దిక్షణాల్లో మెదడు యధాస్థితికి రావటంచేత, కోపం పోయి మామూలు మనిషయ్యేడు. కనిపిస్తున్న దృశ్యాన్ని కళ్ళు నులుముకుని చూసి, ఏమిటిదంతా? అంటూ భార్యని గద్దించి మరీ అడిగేరు. 'నరాలేం' చచ్చుపడ్డాయా? అనిగూడా వాకబు చేసారు. దానికావిడ దీనిక్కారణం నేకాదు. మీరే మహాప్రభో అంటే నమ్మక, కళ్ళెర్రచేసి చేసింది చాలక అబద్ధాలాడతావాని పైపైకొస్తుంటే ఆవిడేదోఅంటే, ఈయనేదో అని, మాటలు పెరిగి, ఘర్షణ జరుగుతుండగానే, ఆయనకేదో బుర్రలో టప్పుమంటూ శబ్దం వినబడటం, వెంటనే-మళ్ళీ కోపం రావటం-

వెంకట నారాయణ వెంటనే మధ్యగదిలోకి వెళ్ళి టేబిలుపైన పాట పాడు

తున్న ట్రాన్సిస్టర్ని చేతిలోకి తీసుకుని ఇంటి పైకప్పుకేసి కొట్టారు. భూమ్యాకర్షణ శక్తి ఆ యింట్లోగూడా వుందికాబట్టి అతి వేగంగా తిరిగొచ్చి నేలకరిచింది. ఆ రేడియో ఇప్పటికీ వుంది. చూట్టానికి భలే ముద్దొస్తుంటుంది. కాని కుయ్ కయ్ అనదు. ఎవరన్నా వెనకాముందూ బాదేసి మరీ మొహమాట పెట్టేస్తేమాత్రం వాతం కమ్మినట్లు గుర్ గుర్ మంటూ మూలిగి వూరుకుంటుంది అంతే.

ఆఇంట్లో సామాన్లన్నిగూడా ఆయన కోపాన్ని ఏదోఒకప్పుడు చవిచూసినవి కావటంచేత అలంకార ప్రాయంగానే వుంటాయిగాని వుపయోగార్థంకావు. ఇంత అనుభవంవున్న శాంతమ్మగూడా ఇంకా మొగుడనే పదార్థంపైన ప్రేమని చంపుకోలేక వుత్సాహంకొద్దీ ఏదో వొకటిచేసి అతడికి కోపం తెప్పిస్తూనే వుంటుంది,

ఆరోజు ... సాయంత్రం...

ఇంకా ఆరుగంటలు కాలేదు. అయిదు గంటల యాభై అయిదు నిమిషాలు కాబోలు అయింది.

వెంకట నారాయణ అప్పుడే ఆఫీసు నించి వచ్చేడు. రాగానే పడక్కుర్చీలో వాలిపోవటం అలవాటు. కాబట్టి వాలిపోయేడు. శ్రీవారురాగానే మంచినీళ్ళగ్లాసుతో రావటం శాంతమ్మ అలవాటు. అంచేత వచ్చింది. రావటమే కాకుండా గ్లాసుని అందించటంగూడా అలవాటు కాబట్టి అందించింది. అందిస్తూనే అలవాటులోని మరోపనొకటి చేసింది. నీళ్ళగ్లాసు వెనకే ఒక పెద్ద పొట్లంగూడా అందించింది. నీళ్ళగ్లాసుని ప్రక్కనపెట్టి పొట్లం తెరిచి చూసేడు.

ప్యాంటూ, షర్టూ - కుట్టించి మరీ వున్నాయ్!

వెంకట నారాయణకేం అర్థం కాలేదు. ఏవిటివి? అనడిగాడు. బట్టలని సమాధానం రాబట్టి, ఏ బట్టలు, ఎవరి బట్టలని వివరణ కోరేడు. మనవేనన్న సమాధానంతో తృప్తి పడక, నీవా నావాని కరుగ్గా అడగ్గా, శాంతమ్మ పెద్దాడు తొలిజీతంలోంచి పంపిన డబ్బుల్లో తనే అతడికోసం కుట్టించినట్లు చెప్పేసరికి అతడిలో సంచలనం లాంటి అశాంతిలాంటి కోపం మొదలయింది.

వెంకట నారాయణ ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం వుండకూడదన్ని నమ్మటవే కాకుండా పైకి చెప్తాడుకూడా. ఈ దేశానిక్కూడా స్వాతంత్రం పనికిరాదనిగూడా అంత గట్టిగానూ అనుకుంటాడుగాని పైకి ఆ మాట చెప్పే సాహసం చెయ్యడు. అంచేత పెద్దాడు నేరుగా తల్లికి డబ్బు పంపటం, ఆవిడేమో ఏకపక్ష నిర్ణయం తీసుకోవటమే కాకుండా, దాన్ని అమలు పర్చటం- అతడి బుర్రలో టప్పుమంటూ శబ్దాలు రావటానికింతేం కారణం కావాలి?

(మాటొచ్చింది కాబట్టి ఓ సలహా - మీ బుర్రలోంచి మీకెప్పుడైనా శబ్దాలు సంగీతాలు వినిపిస్తాయో మోగమనించండి సంగీతం అయితే తిలకించిఆనందించండి గాని, శబ్దాలొస్తేమాత్రం రెండోకంటివాడిక్కూడా తెలీకుండా నిశ్శబ్దంగా డాక్టర్ని సంప్రదించండి. ఎంచేతనంటే, ఈ మధ్యన జపాన్నించి ఆదేదో కొత్తరకం బుర్రలకి సంబంధించిన జబ్బు రవాణా అయిందని బ్రెయిన్ స్పెషలిస్టు రమేష్ పాండే చెప్పారు. ఆయన ఇంకా చెప్పిన కొంతసమాచారం, ప్రతి మనిషి తలకాయలోపల టేప్‌రికార్డరులాంటి వస్తువొకటి ఎడంపక్కగా వుంటుందిట. దానివల్లా దృష్టి ప్రసరించిన ప్రతి సంఘటన రికార్డు చెయ్యటం. దీనికి రీప్లే అంటే జ్ఞాపకం తెచ్చుకోవటం అన్నమాట) సదుపాయం గూడా వుంటుంది. జపాన్‌జబ్బు ఈ టేపు రికార్డర్ని పాడుచేస్తుంది. దీనివల్ల సొంత పెళ్ళాన్ని 'ఏవమ్మా! కులాసాగావున్నావా అనడగటవో, భోంచేసావా? అంటే గుర్తు లేదనటం' సంభవించవచ్చు. అంచేత జాగ్రత్తగా వుండాలని, ఎప్పుడయితే భార్య పరాయి వ్యక్తిలా కనిపించి, పక్కింటి ఇల్లాలు బాగా పరిచయం వున్న వారిలాగా అవుపిస్తారో వెంటనే డాక్టర్ని సంప్రదించమని పాండేగారు నొక్కి వక్కాణించేరు. ఇదంతా బుర్రంటూవున్న వాళ్ళకి కాబట్టి, అదిలేనివాళ్ళు ఎటువంటి ఆందోళన చెందనక్కర్లేదనిగూడా హామీ ఇచ్చేరు. దీన్నిబట్టిచూస్తే వెంకట నారాయణ బుర్రలో టేప్‌రికార్డర్ పూర్తిగా పాడవలేదుగాని, కోపం వచ్చినపుడు, టప్పుమని శబ్దంచేసి ఆగిపోతుంది కొద్ది నిమిషాలు. అంచేత ఆ కాస్సేపు అతడికంతా బ్లాంక్ - ఏమీ తెలీదు. తర్వాత గుర్తుకూడా రాదు.)

వెంకట నారాయణ బుర్రలోపల ఆ సాయంత్రం టప్‌మంటూ శబ్దం అయినప్పుడు సరిగ్గా ఆరుగంటలయింది. సూర్యుడు అస్తమించేడు. చీకట్లు వ్యాపిస్తున్నాయి. ఆ నియోజకవర్గం ముష్టివాడు ఇంటిముందు నిల్చుని గొంతెత్తి అరుస్తున్నాడు.

నిశ్శబ్దాన్ని తలంతా నింపుకున్న వెంకట నారాయణకి చేతిలోవున్న పొట్లాన్ని ఏంచెయ్యాలో అర్థం కాలేదు. గోడకా? నేలకా? పై కప్పుకా? భార్య మొహానికా? దేనికేసి కొడితే ధర్మంగా న్యాయంగా వుంటుందాని ఆలోచిద్దామనుకుని ఆలోచించలేక అనుకోకుండా, అప్రయత్నంగా శబ్దం వస్తున్న వీధిలోకి వెళ్ళాడు.

శాంతమ్మకేంఅర్థంకాక పిచ్చిచూపులు చూస్తూ నిల్చుండిపోయింది.

ఇంటిముందు నిల్చుని గొంతు చించుకుంటున్న ముష్టి మహరాజు పేరు పేరిగాడు. సన్నాఫ్ పీరిగాడు. యాచక వృత్తిలో ఆరితేరిన వంశం వాళ్ళది. చదువుకుని దగాపడటం ఇష్టంలేక ఆ జోలికే పోలేదావంశీయులు. అడుక్కోవటం, దోచుకు తినటం ఈ రెండే బ్రతకటానికి రాజమార్గాలని వాళ్ళ పూర్వీకులు చెప్పటంచేత, పేరిగాడితోసహా అంతా అడుక్కోవటమే పరమావధిగా పెట్టుకున్నారు. పేరిగాడు వెంకట నారాయణంత ఎత్తుగావుంటే, ఆయనకంటే బలంగా కూడా వున్నాడు. కాకపోతె వృత్తిరీత్యా హాకీస్టిక్కులాగా వొంగి నిల్చోవటంచేత పొట్టిగా అవుపిస్తాడు.

వెంకటనారాయణ ఇంట్లోంచి నిద్రలో నడుస్తున్నవాడిలాగా చేతిలో పొట్లంతో సహా రావటం అరుస్తున్న పేరిగాడుచూసి అవాక్కయిపోయేడు. ఆయన పేరిగాడికి అంగుళం దూరంవరకు వచ్చి ఎంచేతనో ఆగిపోయి, చేతుల్ని కాస్త ముందుకు చాచటంతో అందుకోవటం అలవాటు చేసుకున్న పేరిగాడు ఆయన చేతుల్లోని పొట్లాన్ని అందుకుని వుండబట్టలేక విప్పి

చూసేడు.

ప్యాంటు, బుల్లికోటు (సఫారీ)!

వెంకట నారాయణ తెలుగు నిక్షిప్త కళాప్రాంగణంలో మరో బొమ్మలాగా నిల్చుండిపోయాడు.

పేరిగాడుమాత్రం సంతోషపడిపోయి 'దరమ పెబువులు. బట్టలు కుట్టించి మరీ ఇచ్చేరు. నూరేళ్ళు (నీ కోపం) సల్లంగుండాల.' అనుకుంటూ హాకీకర్ర లా వున్నవాడల్లా బెండుకర్రలా వ్యాకోచించి వెళ్ళిపోయేడు.

శాంతమ్మ బయటికొస్తుంటే, వెంకట నారాయణ లోపలికొస్తూ ఎదురయ్యేడు. అప్పటికే పేరిగాడు ఆ పేట దాటి వెళ్ళిపోవటం, వెంకట నారాయణ బుర్రలోని టేపురికార్డరు తిరిగి పన్చెయ్యటం, అయనంతా మర్చిపోవటం జరిగిపోయింది.

'అయ్యో! బట్టలేంచేశారండీ?' అనడిగింది మొగుడ్ని కంగారుగా. భార్య ప్రశ్నకి ఆయన బోల్డంత ఆశ్చర్యపడి, వొంటికున్న బట్టలవంక చూసుకుని 'వున్నాయిగా! బట్టలేవిటీ?' అంటూ అమాయకంగా అడిగారు. "ఇవికావండి, కొత్తవి. ఇప్పుడు మీకిచ్చేనే - అవ్వి". అంటూ ఇంకేదో అనబోతుంటే వెంకట నారాయణకి కోపం రాబోగా తమాయించుకునేటందుకు తమాషాగా నవ్వి 'చాల్లే! కొత్తబట్టలెక్కడివి? నాకివ్వటం ఏవిటి? వెళ్ళు, వెళ్ళి రెస్టతీసుకో, అన్నట్లు ఆ కేప్సిల్స్ వాడుతున్నావా? రెస్ట్ చాలా అవసరం అని డాక్టరు చెప్పాడు' అంటూ సానుభూతిగా మంచంలో వున్నవాడికి ఆదేమంచం చివర్న కూర్చున్నవాడిలాగ సలహా ఇస్తూనే లోపలికి వెళ్ళిపోయాడు.



శాంతమ్మకి వాదించి లాభం లేదని అర్థం అవటంచేత ఆదుర్దాగా వీధిలోకెళ్ళి అటూ ఇటూ చూసింది. ఖావిలోకి తొంగి చూసింది. ఖావిలో నీళ్ళే వుండవ్. ఇహ బట్టలు, ఆభరణాలు ఎక్కడుంటాయ్?

ఏవైనట్లు? ఏంచేసినట్లు?

ఆరాత్రి భోజనం దగ్గర, పడగ్గదిలోనూకూడా అడిగి చూసింది. ఆయన అడిగిన ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండా ఆవిడ ఆరోగ్యం గురించి విచారణ చెయ్యటంతో ఆశ వదులుకుంది. కాని మానవ ప్రయత్నంమాత్రం మాన్లేదు. నాలుగొందలు బూడిదపాలయ్యేయన్న బాధకన్నా కొడుకు పంపిన తొలిజీతం ఇలా అదృశ్యమైందేవిటన్న ఆదుర్దా, వాడి జీవితవంతా జీతాలు ఇలాగే అయిపూ అజా లేకుండా అంతర్థానమవుతాయేమోనన్న బెంగ - ఎక్కువ బాధపెట్టసాగేయ్.

ఆ మర్నాడుకాక, ఆ మర్నాడు - వెంకట నారాయణకి ఆఫీసుకి సెలవు. అంచేత వసారాలో కూర్చుని పేపరు చదూకుంటున్నాడు. శాంతమ్మ పక్కింటి పిన్నిగారింటికెళ్ళొస్తానని ప్రక్క వీధిలో వున్న ఆంజనేయస్వామి భక్తుడివద్ద కెళ్ళింది. ఆ భక్తుడు చాలా గొప్పవాట్ట. అరడజను అరటిపళ్ళో, యాపిల్‌కాయలో ఆయన చేతిలో పెట్టి మీ సమస్యలేమిటో చెబితే, ఆయన పళ్ళు చేత్తోపుచ్చుకుని, కళ్ళు మూసుకుని సమాధానం ఇట్టే చెబుతాట్ట. పశువులు, మొగుళ్ళు, పిల్లలు, వస్తువులు ఏంపోయినా, చేతులుమారినా ఎక్కడున్నాయో చూసినట్లు తీసి దాచినట్లు కరక్టుగా చెప్తాడట.

శాంతమ్మ వెళ్ళిన పదినిమిషాలకి వచ్చేడు పేరిగాడు. మొహం విషాదంగా వుంది. అడుక్కోవటం నిషేధిస్తూ ఆర్డినెన్సు రాబోతోందన్న సంగతి ఎమ్మెల్యే క్వార్టర్సులో విని ఇలా వచ్చినట్లుంది వాడి వాలకం. చేతిలో పొట్లంగూడా వుంది. దాన్ని వాడు పాము బుట్టని పుచ్చుకున్నంత భయంగా పుచ్చుకున్నాడు.

వసారా కుర్చీలో మూడోపేజీలోని 'నగర నేరాలు' చదువుతున్న వెంకట నారాయణని 'బాబూ! ఇలా ఓసారి రండ'ని ఎంతో మర్యాదగా ఆహ్వానించాడు. కాని పేపర్లో లీనమైపోయిన వెంకట నారాయణ ఆ ఆహ్వానాన్ని మన్నించక 'అమ్మగారు లేరు తర్వాత కనపడు' అన్నాడు విసుగ్గా.

ఆ సమాధానానికి పేరిగాడు నిజంగా పిలుస్తాడు. అడుక్కుతినే వాళ్ళయినా అప్పుడప్పుడు ఒక పక్షమీదగూడా వస్తారన్న ప్రాథమిక జ్ఞానంలేని ఆయనని చూస్తే జాలీ, కోపం కలిగినా, తమాయించుకుని 'మీతోనేబాబూ నా పని - ఓ నిమిషం ఇలా దయచెయ్యండి' అంటూ దుళ్ళీ ఆహ్వానించేడు.

అయినా వెంకట నారాయణ కదలకపోవటంతో, ఇలా కాదని పేరిగాడే మెట్లెక్కి వసారాలో కెళ్ళి, చేతిలో పొట్లాన్ని ఆయనకందించి 'తీసుకోండి తవరే కట్టుకోండి' అన్నాడు నమ్రతగా.

వెంకట నారాయణకి ఏం తీసుకోమంటున్నాడో, ఏం కట్టుకోమంటున్నాడో అర్థంకాక, పేపరు పక్కనపడేసి, పొట్లం విప్పి చూసేరు. ప్యాంటు, బుల్లికోటు!

ఆయనకి అహం దెబ్బతినగా, ఆవేశంగా 'ఏరా - ఈమధ్యన ముష్టివెధవలు కూడా బట్టలూ అవీ పెడుతున్నారా? వాళ్ళుగాని కొవ్వెక్కిందా? నీ ముష్టి బట్టలు నే కట్టుకోవాలా?' అరిచేరు.

పేరిగాడుమాత్రం ఠాపీగా 'ఆ బట్టలు మీవేబాబూ - తవరే నాకిచ్చేరు' అన్నాడు.

'నేను - వీటిని నీకిచ్చానా? ఎందుకిచ్చాను? నాకేమన్నా పిచ్చా?'

"[illegible] మాత్రం నన్ను [illegible] [illegible] ... అంతేనండి. [illegible] మిమ్మల్ని సంపుకు తిన్నంత [illegible]. అంతా ఎగాదిగా చూసాకేగాని సేతులే ముందుకు రాలేదండి. నిన్న రోజంతా పస్తుండి. అంచేత తవరే వాటి నుంచేసుకోండి" అంటూ ముగించేడు.

'అబద్ధం' అంటూ అరిచేడు వెంకట నారాయణ.

'నిజం' అన్నాడు పేరిగాడు.

"కాదు - అబద్ధం - అబద్ధం"

"ఏంకాదు - నిజం - నిజం - నిజం"

వెంకట్నారాయణకి వాడి రెట్టింపుతో రెట్టింపు ఆవేశం వచ్చింది. చేతిలోని ప్యాకెట్టుని నేలకేసి కొడుతుండగా తలకాయ లోపల టప్ మన్న శబ్దం.

సరిగ్గా అదేసమయానికి పేరిగాడికి కోపం వచ్చేసింది. వాడికి ఏడాదికి లెక్కప్రకారం ఒక్కసారి మాత్రమే వస్తుందిట చిత్రంగా వాడిక్కోపం వచ్చినపుడు వెయ్యేనుగులబలం వస్తుందిట. తనేంచేస్తున్నాడో తెలుస్తూనేవుంటుందిటగాని శరీరం

మాత్రం వా॰ ఆధీనంలో వుండదుట.

ఒకసారి హోటల్లో కాఫీ త్రాగుతుండగా కోపం వస్తే వంటగదిలోకి రివ్వున బాణంలాగా దూసుకెళ్ళి వచ్చి ఫిండితో సహా పదార్థాలన్నీ తినేసాట్ట. తర్వాత బాధపడ్డాడు. అలాగే ఇంకోసారి సినిమా హాలుముందు నిల్చుసుండగా కోపంవస్తే ఓ సిక్కులాల్చీ పెద్దమనిషిని అమాంతం గాల్లోకి లేపి గిరగిరాతిప్పి విసిరేసాట్ట. ఆయనెళ్ళి 'మీ వీధులని పరిశుభ్రంగా వుంచండి' అని రాసున్న లారీలో ధభీమంటూ పడ్డాట్ట. తర్వాత తెల్సింది ఆయన ఆ హాలు యజమానని.

వెంకట నారాయణ తన నిజాయితీని గుర్తించకపోగా, పొట్లాన్ని నేలకేసికొట్టి, పైగా పొట్లగిత్తలాగా ఎగిరెగిరి పడటం చూసేసరికి పేరిగాడికి ఆ సంవత్సరం కోపం అక్కడే వచ్చేసింది.

దాంతో పొట్లాన్ని జామ్మని చించేసి ప్యాంటూ, బుల్లి కోటూ ఆయనపైకి గిరాటేసి 'కట్టుకో' అంటూ పెద్దగా అరిచేడు.

ఆ అరుపుతో వెంకట్నారాయణకి కోపం మరింత పెట్రేగగా పేపరు చించేసి కుర్చీలన్నిటిని పేరు పేరువరసనా తన్ని ఇంకా ఏదో కార్యక్రమం తలపెడుతుండగా, పేరిగాడు రెట్టింపుగా పెట్రేగి, మేకపైకి పులి దూకినట్లు ఆయనపైకి లంఘించి, నేలపైకి పడగొట్టి గుండెలపై కూర్చుని పంచెలాగి, ప్యాంటు ఎక్కించి బుల్లికోటుగూడా తొడిగి, తిరిగి అవలీలగా ఆయన్నెత్తి కుర్చీలో కూలేసి 'ఊ. బొత్తాలు పెట్టుకో' అంటూ ఆజ్ఞాపించేడు.

ఇద్దరూ ఆవేశంచేత అబ్నార్మల్గా రొప్పుతున్నారు. ఇద్దరూ కోపంలో వున్నారు. ఏంజరిగిందో పేరిగాడికి తెలుసు. వెంకట్నారాయణకి తెలీదు. అంతేతేడా?

వెంకట్నారాయణ సుశిక్షితుడైన సైనికుడిలాగా పేరిగాడి ఆజ్ఞమేరకు బొత్తాలు పెట్టుకుంటుండగా -'జాగ్రత్త-అడుక్కునే వాళ్ళకైనా ఆవేశంవస్తే ఇలాగే వుంటుంది' ఒక కఠిన సత్యాన్ని ప్రబోధించి, వెళ్ళిపోయేడు.

వెంటనే శాంతమ్మవచ్చింది. గుమ్మంలోనే ఆగిపోయింది. పేపరంతా చిరిగిపోయుంది. కుర్చీలన్నీ తిరగబడ్డాయ్, పతిదేవుడు పిచ్చిచూపులుచూస్తూ కూర్చుని వున్నాడు. శాంతమ్మకి గుండె దడదడలాడింది. ఎవరో మొగుడ్ని మృదంగం వాయించేసి కొంపంతా దోచుకుపోయుంటారని వూహించి, అరవబోయి, ఆయన వొంటిపైనున్న బట్టల్ని చూసి ఆగిపోయి ఆశ్చర్యపడింది.

"ఏవండీ! ఈ బట్టలెలా వచ్చేయండీ? వీటిగురించే ఇన్నాళ్ళూ నేనడిగింది" వగైరా ఆవిడ ప్రశ్నలకి వెంకట్నారాయణ, పసిపిల్లవాడిలాగా అమాయకంగా 'నాకేంతెలీదు. నాకేంతెలీదు. అబ్బ... వొళ్ళంతా కుస్తీపట్టినట్టు -' కళ్ళుమూసుకోగా, శాంతమ్మ మరేం విసిగించక స్వామివారి బండారు మొగుడి మొహాన దిద్ది 'అంతా స్వామివారి చలవ - స్వామివారి చలవ' అనుకుంటూ లోనికెళ్ళింది.

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11, Chikkadapalli, Hyd-20, & Printed by P. Ramakrishna at Raghava Printers 1-8-4/1/1, Chikkadapalli, Hyderabad-20.

లైఫ్‌బాయ్ ఎక్కడో ఆరోగ్యం అక్కడ




లైఫ్‌బాయ్

మురికిలోని క్రిములను వదలగొడుతుంది

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి